# లోక విద్య ప్రపంచం

మాసపత్రిక

బులెటిన్ ఆగష్టు 2012 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2


## దేశ ప్రజలందర్నీ నిర్వాసితులను చేసే ప్రమాద ఘంటికలు సూచిస్తున్న లక్ష్మీపేట, వాన్‌పిక్, సింగూరు ఘటనలు

బహుజన సమాజ్‌పార్టీ ఉత్తరప్రదేశ్‌లో తాజ్‌కారిడార్ పేరుతో, కార్ల ఫ్యాక్టరీ పేరుతో మార్కిస్టు పార్టీ సింగూరులో పాన్కో కంపెనీ కోసం బి.జె.పి పార్టీ మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్‌లో, కుడుంకొళం అణు విద్యుత్ ప్రాజెక్టు కోసం అన్నాడిఎం.కె ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో జరుపుతున్న భూసేకరణను మనం చాలా నిర్లిప్తంగా దేశమంతా చూస్తుంటే మన వాన్‌పిక్, లక్ష్మీపేట మరో ప్రాజెక్టు కోసం అడవుల నుండి గిరిజనులను, భూముల నుండి రైతులనూ, విమానాశ్రయాల కోసం, వెడల్పాటి రోడ్లుకోసం, విద్యుత్ ఫ్యాక్టరీల కోసమైతేనేమి, నీటి పారుదల ప్రాజెక్టుల కోసమైతేనేమి, ఖనిజ సంపదకోసం గనులను తవ్వడంగాని, ప్రజలను తరమడంలో కాంగ్రెస్ అంకురార్పణ చేస్తే, తెలుగుదేశం దానిని పోషిస్తే అభివృద్ధి పేరుతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మన రాష్ట్రంలో ప్రజలను వారు పుట్టిన ఊళ్ళ నుండి పొట్టచేత పట్టుకొని ఉద్యోగాన్వేషణలో నిర్వాసితులుగా వెళ్ళాల్సిన పరిస్థితులను త్వరితగతిన విస్తారంగా చేయటం తెలుగు ప్రజలంతా గమనిస్తున్నారు. కొండ, అటవీ ప్రాంతాలనుండి గిరిజనులు, మైదాన ప్రాంతాల నుండి రైతులు, తీరప్రాంతం నుండి మత్స్యకారులు ఈనాటి అభివృద్ధిలో సమిధలవుతున్నారు. అదే సమయంలో అతి కొద్దిమంది పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి దారులతో పాటు కొంతమంది సాంకేతిక నిపుణులు కూడా విపరీతంగా బాగుపడుతున్నారు. ఇలా నష్టపోయినవారితో తమ పారంపర్య జ్ఞానంతో తమ వృత్తులు చేసుకునే వారు కొత్త ప్రదేశంలో తమ జ్ఞానానికి సంబంధించని వృత్తులలో అజ్ఞానులుగా పిలువబడుతూ వెనుకబడిన వారిగా, దళితులుగా ముద్ర వేయించుకొని ఏం చేయాలో తెలియక కూలీలుగా జీవనం సాగిస్తూ కొత్త సమాజంలో బానిస బతుకు యీడుస్తున్నారు. ఈ బానిసల కోసమే మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశ పెట్టడం జరిగింది.

ఈ క్రమంలో పునరావాస ప్యాకేజీల పేరుతో చేతికొచ్చిన సొమ్ము కొద్ది రోజులలో అయిపోయి తమకున్న జ్ఞానం ఎందుకు పనికిరాక ఉత్పత్తుల్లో పాలుపంచుకోవడం నిరాకరింపబడి ఈ అభివృద్ధి భూతం కోరల్లో చిక్కుకుపోయారు. ముందు తరాల నుంచి వచ్చిన భూమిని తరువాత తరానికి వారి జీవితానికి భరోసాగా ఇవ్వలేని వారిగా మిగిలిపోతున్నారు. వారి పిల్లల భవిష్యత్ అంధకారంలోకి నెట్టబడింది. వీరికి యిచ్చే పునరావాస పాకేజి సొమ్ము కొద్ది లక్షల్లో ఉంటే హర్యానాలో జాతీయ రహదారి ప్రాజెక్టు, ఢిల్లీలో ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు, 2జి స్పెక్ట్రమ్ ప్రాజెక్టులలో పెట్టుబడిదారులు వేల లక్షల కోట్లు పోగేసుకుంటున్నారు. ఈతరం వారికి ప్రతిఫలంగా యిచ్చిన సొమ్ము అథవా వారికి సరిపోయినా వీరి జ్ఞానాన్ని తరువాత తరాలవారి జ్ఞానాన్ని యీ నూతన అభివృద్ధి చెందిన సమాజం వెలివేయటంతో రైతులు, ఆదివాసీలు, మత్స్యకారులు, ఇతర వృత్తిదారులు మొదటి సారిగా వివిధ ప్రాంతాలలో భూసేకరణను వ్యతిరేకించడం చూడవచ్చు. ఇది వట్టి ఆర్థిక సమస్య మాత్రమేకాదు. తరతరాల జ్ఞానం, సంస్కృతి, భాష జీవన విధానం ఒక్క మాటలో చెప్పాలంటే ఆత్మ గౌరవానికి సంబంధించిన సమస్యగా మారింది. అందుచేత నర్మదా లోయపరివాహక ప్రాంతం, బస్తర్ ప్రాంతం గిరిజనులు తమ జీవనాధారమైన అడవులను, అటవీ సంపదను వదులుకోవటానికి సిద్ధంగాలేరు. ఈ ఉద్యమాలన్నిటిలోను మనం చూడదగిన విషయం ప్రతి ప్రాంతంలోను తమ జ్ఞానంతో ఉత్పత్తిచేసి జీవనాన్ని సాగించే "లోకవిద్య" జీవితాన్ని కోరుకుంటున్నారు. వీరి నిరసనలు వారి జ్ఞాన సంపదను ఎందుకు కొరగానిదని, గిరిజనులు, రైతులు, మత్స్యకారులు ఆచరిస్తున్న ఉత్పత్తి విధానాలు వెనుకబడినవని ముద్రవేసి అభివృద్ధి పేరుతో పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలు సాగించే దోపిడీని వ్యతిరేకించే ఉద్యమాలుగా చూడాలి. ఈ ఉద్యమాలను 'లోకవిద్య' ఆధారిత ప్రజలందరూ, మానవ విలువలకు నిలబడే ప్రజలందరూ, ఒక్క మాటలో ఆత్మ గౌరవం కోసం నిలబడే ప్రజలందరూ మద్దతు తెలపాల్సిన అవసరం ఉన్నది.

సేకరించిన ప్రభుత్వ భూమిలో తిరిగి వ్యవసాయం చేసే దళిత రైతులు మీద ఏనాడు వ్యవసాయం చేయని వారు చేసిన దాడిని కుల ఘర్షణగా మార్చడం జరుగుతోంది. దీనిలో మనం గమనించాల్సిన విషయం ప్రభుత్వ భూములను దున్నుకునే వారే అనుభవించాలనే సాధారణ న్యాయాన్ని మరచి కులంపేరుతో సాటి రైతుల మధ్య ఘర్షణాత్మక వైఖరి పెంపొందించే పట్టణ బాట పట్టిన మాజీ భూస్వాముల చర్య అని చెప్పటానికి ఏ మాత్రం సందేహంలేదు.

నేడు జరుగుతున్న భూసేకరణ వ్యతిరేక పోరాటాలన్నీ జీవించే హక్కు పోరాటాలే. ఈనూతన అభివృద్ధి నమూనాలో అత్యధిక ప్రజలు నిర్వాసితులుగా, వెనుకబడిన వారిగా, ఏ విధంగాను ఉత్పత్తికి పనికి రానివారిగా ముద్రవేయించుకోవటానికి పారంపర్య వృత్తిదారులు ఇక ఏ మాత్రం సహించరు.

## చిల్లర వ్యాపారంలో మల్టి నేషనల్ (బహుళ జాతి) కంపెనీలకు అనుమతి- దేశ ఆహార భద్రతకు ముప్పు

మన 66వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ "దేశంలో ప్రస్తుత ఆర్థిక మందగమనానికి" రాజకీయ ఏకాభిప్రాయం లేకపోవడమే ముఖ్య కారణంగా పేర్కొన్నారు. ఇంకా విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఆర్థిక రంగాన్ని పరుగులు పెట్టిస్తామన్న ధీమాను వ్యక్తం చేశారు.

1991లో నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణలు భారతదేశంలో ప్రవేశపెట్టినప్పటి నుండి పారిశ్రామికవేత్తల పెట్టుబడులు వారికి చుక్కలను దాటే లాభాలను చూపించాయి. అయితే యీ సంస్కరణలు దేశానికి చేసిన 'మేలు' అలా పక్కన ఉంచితే. తరతరాలుగా కులవృత్తులపైన, చేతివృత్తులపైనా, వ్యవసాయంపైనా ఆధారపడి జీవిస్తున్న కష్టజీవుల బ్రతుకులను బజారులో నిలబెట్టాయి. 1995 నుండి 2010 మధ్య 256913 మంది అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడటం జరిగిందని నేషనల్ క్రైమ్ రికార్డ్సు బ్యూరో లెక్కలు చెబుతున్నాయి. తొలిదశ సంస్కరణలు దేశంలో తీవ్ర నిరసనకు దారితీశాయి. అయితే అమెరికా అధ్యక్షులవారు ఈమధ్య భారత్‌లో "పెట్టుబడుల వాతావరణం క్షీణించిపోతున్న"దని బహిరంగంగా ఆందోళన వ్యక్తం చేశారు. మలిదశ సంస్కరణలు అమలుచేయడానికి ఇదే అనువైన సమయం కావచ్చునన్న అంశంపై భారత్‌లో ఏకాభిప్రాయం పెరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయంటూ అమెరికన్ వ్యాపారవర్గం ఉవాచగా ఆయన సెలవిచ్చారు. పి.టి.ఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఆ ఇంటర్వ్యూలోనే భారత్‌లో 'చిల్లర' వ్యాపారంలో బహుళజాతి సంస్థల ప్రవేశం ఆవశ్యకతను తెలిపారు. 120 కోట్ల జనాభా గల భారతదేశంలో 'చిల్లర వ్యాపార రంగం' టర్నోవర్ దాదాపు పాతిక లక్షల కోట్లు. ఇంత పెద్ద మార్కెట్ చైనాలో తప్ప ప్రపంచంలో మరెక్కడలేదు. వందలాది పల్లెల్లో, పట్టణాల్లో విస్తరించి ఉన్న యీ చిల్లర వ్యాపార రంగాన్ని ఆసరా చేసికొని దాదాపు 30 కోట్ల మంది బ్రతుకుతున్నారు. విదేశీ ఎఫ్.డి.ఐ.ల రాకతో వీరి జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారనుంది. బియ్యం, ఉప్పు, పప్పు, చింతపండు లాంటి నిత్యావసరాలను ప్రజలు కొనుగోలు చేయడానికి భారతదేశంలో విదేశీ పెట్టుబడులతో నిర్వహించే 'మాల్స్' అవసరమేమిటో ప్రభుత్వానికే తెలియాలి. ప్రస్తుత 'టోకు' వ్యాపారులు నిర్వహించే వ్యాపారాన్ని, విదేశీ 'టోకు' వ్యాపారులకు 'సరళీకరణ' పేరుతో అప్పగించడం ఎంత వరకు సబబు.

యిక దేశంలో వ్యవసాయదారులు, కార్పొరేట్ వ్యాపార రంగాల వారి అభీష్టం మేరకు వారు చెప్పిన పంటలు మాత్రమే పండించాలి. పంటకు గిట్టుబాటు ధరలు నిర్ణయించడంలో ప్రభుత్వ పాత్రేమీ ఉండబోదు. వ్యాపారానికి పరమావధి 'లాభం' కాబట్టి యీ విదేశీ రిటైల్ సంస్థలు రైతుల నుండి అతి తక్కువ ధరలకు ఆహార పదార్థాలను సేకరించి, నిల్వ ఉంచి, కృత్రిమ కొరతను సృష్టించి, వినియోగ దారులను నిలువు దోపిడి చేయగల వన్నదాంట్లో, ఎట్టి సందేహము అవసరంలేదు. 51 శాతం పెట్టుబడితో మొదలయ్యే యీ విదేశీ ఎఫ్.డి.ఐ.ల మీద భారత ప్రభుత్వ నియంత్రణ ఏ మాత్రం ఉండబోదు. ఇక వ్యవసాయ అనుబంధ పరిశ్రమలుగా ఉన్న పాడిపరిశ్రమ, కోళ్ళు, గొర్రెలు, చేపల పెంపకం దార్లు విదేశాల నుండి అతిచౌకగా టన్నుల ద్వారా దిగుమతి అయ్యే పాలపొడి, యితర మాంసం ఉత్పత్తులు స్వదేశీ ఉత్పత్తి దారులను దారుణంగా దెబ్బతీసి వాళ్ళ జీవనాధారాల నుండి వేరు చేయగలవు. విదేశీ ఎఫ్.డి.ఐ. లు భారతదేశ గ్రామీణ జీవన వ్యవస్థనే క్రమేణా నిర్వీర్యం చేయగలవు. అందువలన ఒక్క రిటైల్ రంగంలో ఉన్న వ్యాపార వర్గమే కాకుండా రైతులు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలలో ఉన్నవారు, మొత్తంగా వినియోగదారులు భారతదేశంలోకి మల్టీబ్రాండ్ ఎఫ్.డి.ఐల ప్రవేశాన్ని వ్యతిరేకించాలి.

చిల్లర రంగంలో సైతం పోటీ పెరిగితేనే నాణ్యమైన వస్తువులు చవగ్గా లభిస్తాయన్న వాదనను ఎవరూ నమ్మడం లేదు. గొలుసు మార్కెట్లుండే బహుళ జాతి సంస్థలు ఆదిలో నష్టాలనైనా భరించి ధరలు తగ్గించ వచ్చేమోకాని, మార్కెట్ ఏకపక్షం అయ్యాక విజృంభించక మానవన్నది దేశ దేశాల్లోను వెల్లడైన సత్యం. థాయిలాండ్‌లో పళ్ళు, కూరగాయలు అమ్మకాలు మొత్తం తోపుడు బండ్ల వాళ్ళ నుంచి సూపర్ మార్కెట్ వాళ్ళు పూర్తిగా హస్తగతం చేసుకున్న తర్వాత ధరలు 10 శాతం పెరిగాయని అదే నిష్పత్తిలో సూపర్ మార్కెట్ లాభాలు పెరిగాయని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. రష్యాలో పారంపర చిల్లర దుకాణాల స్థానే సూపర్ మార్కెట్‌లు వచ్చిన తర్వాత ధరలు 25 శాతం పెరిగాయి. అంతెందుకు 1994 నుండి 2004 మధ్యకాలంలో అమెరికా సూపర్ మార్కెట్‌లలో టమాట ధరలు 45 శాతం పెరగగా అదే సమయంలో రైతులకి 25 శాతం తక్కువ ధర చెల్లించడం జరిగిందని ప్రభుత్వ లెక్కలే చెప్తున్నాయి. అర్జెంటీనాలో పోయిన 10 సంవత్సరాలలో 64,200 చిల్లర దుకాణాదారుల్లో 20,200 మంది దుకాణాలు మూసుకోగా గత్యంతరం లేని 44,000 మంది చిల్లర వ్యాపారంలో ఇంకా ఉన్నారు. 1987-1996 మధ్యకాలంలో బ్రెజిల్ దేశంలో 27.8 శాతం పళ్ళు, కూరగాయల శాతం చిల్లర మార్కెట్‌లో తగ్గిపోయినది.

దీని పర్యవసానం దేశంలో చిల్లర దుకాణాలు, తోపుడు బండ్లు, సైకిళ్ళపై వ్యాపారం చేసే కోట్లాది ప్రజలు పని లేక పస్తులుండే కాలం ఎంతో దూరం లేదు. కార్పొరేట్ సంస్థలు దేశంలోని మూడు పారిశ్రామికవేత్తల సంఘాలు 'మనిషి రక్తం రుచి మరిగిన పులుల్లా' ఆర్థిక సంస్కరణల 'రెండోదశ' ప్రారంభించాలని ప్రధాని మీద ఒత్తిడి తెస్తున్నాయి. చాపకింద నీరులాగా విదేశీ పెట్టుబడులతో యీ దేశంలో చిల్లర వ్యాపారం నిర్వర్తించుకోవడానికి కేంద్రమంత్రి వర్గం గత సంవత్సరం నవంబరు 24న మల్టీబ్రాండ్ రిటైల్ 51 శాతం విదేశి పెట్టుబడిని అనుమతిస్తూ నిర్ణయం తీసుకోవడం జరిగింది. అయితే తీవ్ర వ్యతిరేకత రావడంతో నిర్ణయం అమలును ప్రస్తుతం వాయిదా వేసింది. ఎఫ్.డి.ఐ.పై నిర్ణయం తీసికొనే అధికారం కేంద్రానిదే అయినా దీనికి సంబంధించిన అనుమతులను స్థానికంగా యివ్వాల్సింది రాష్ట్రప్రభుత్వాలే. బి.జె.పి. పాలిత రాష్ట్రాలు, తృణమూల్ కాంగ్రెస్, కేరళ ప్రభుత్వాలు తమ వ్యతిరేకను బాహటంగా వెల్లడించాయి. కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాలు 'గోడమీద పిల్లి' వాటం ప్రదర్శిస్తున్నాయి.

మల్టిబ్రాండ్ చిల్లర వ్యాపారం 51 శాతం విదేశి పెట్టుబడులతో భారతదేశంలోకి అనుమతించడం దేశ ఆహార భద్రతకే ముప్పు. స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున ఉద్యమించి దేశ జనాభా ఆహార ఉత్పత్తి, పంపిణి వ్యవస్థలను విదేశి మల్టి నేషనల్ కంపెనీల బారినుండి రక్షించుకోవాలి. 70 కోట్ల జనాభా కలిగిన వ్యవసాయ, చేతివృత్తుల, కార్మికుల, దినసరి కూలీల ఆహార భద్రతా వ్యవస్థను నిర్వీర్యంచేసి, వాళ్ళను శాశ్వతంగా పేదరికంలోకి నెట్టివేసే ఎటువంటి ప్రభుత్వ చర్యలనైనా తీవ్రంగా ప్రతిఘటించాలి. అమెరికాకు 'జలుబు' చేస్తే, భారత దేశం 'తుమ్మా'ల్సిన అవసరం లేదు. ఎవరి జాతీయ అవసరాలు వారికుండాలేగాని ఏ స్వాతంత్ర్య దేశం తమ జాతి ప్రయోజనాలను విదేశీ శక్తులకు పణంగా పెట్టకూడదు. ఈ దేశ ప్రజల్ని అమెరికన్ మల్టీ నేషనల్ కంపెనీల లాభార్జనలో 'సమిధలు'గా చేసే ప్రయత్నాన్ని తీవ్రంగా నిరసించాలి. సర్వసత్తాక భారత దేశంలో రైతు, చేతివృత్తుల, కార్మికుల, దినసరి కూలీల సంక్షేమం వైపు పయనించే చర్యలను చేపట్టాలని పాలక పక్షాలను నిలదీయాలి. ప్రజలు స్థానిక చిల్లర వ్యాపారుల వద్ద మాత్రమే వస్తువులను, సంతలలో కూరగాయలు కొనటం ద్వారానే తమ కర్తవ్యాన్ని నిర్వహించాలి.

- ఐ. నాగేశ్వరరావు

# కుందేరు డ్రైన్ పరివాహక ప్రాంతాన్ని కాపాడుకుందాం

చీరాల పట్టణ జనాభా 2011 సెన్సెస్ ప్రకారం 87,339 మందిగాను గ్రామీణ ప్రాంత జనాభా 85,696గా నమోదయింది. అదే విధంగా గ్రామీణ పట్టణ ప్రాంతాలలో గృహ నిర్మాణాల సంఖ్య 9000లకు పైగా 2001-2011 మధ్యకాలంలో పెరిగాయి. ఈ విధమైన పెరుగుదల వలన ప్రతిరోజు ఇండ్ల వాడకము నీరు సరాసరి సెకనుకు 83.33 లీటర్లు, ఒక గంటకు 2,99,998 లీటర్లు ఇండ్లలో వాడుకుంటున్న నీరు మురుగు నీటి పారుదల మార్గాల ద్వారా కుందేరులో కలుస్తుంది. వర్షం పడినపుడు సెకనుకు 3996 లీటర్లు, గంటకు 1,42,77,600 లీటర్లు వివిధ మార్గాల ద్వారా కుందేరులోకి వెళుతుంది. (ప్రజారోగ్య శాఖ/2012/39 ఎమ్ తేది. 13.02.2012 వారి లేఖ ననుసరించి) ఈ వివరములు అన్నీ కేవలం చీరాల ప్రాంతానికి సంబంధించినవి మాత్రమే.

చీరాల పరిసరప్రాంతాలయిన కారంచేడు, బాపట్ల భౌగోళికస్థితి మరియు త్రాగునీరు, మురుగునీరు, సేద్యపునీరు కొరకు ఏర్పరిచిన కాలువలు కూడా చీరాల ప్రాంతముపై ప్రభావము చూపిస్తాయి. చీరాల ఎగువ ప్రాంతమైన కృష్ణాడెల్టా నదీ పరీవాహక ప్రాంతానికి అనుసంధానమైన కాలువల ద్వారా సాఖిరేవు, కొమ్మమూరు కెనాల్, రొంపేరు కాలువల ద్వారా సేద్యపు నీటి, తాగునీటి వనరులు కలుగుతున్నాయి. కారంచేడు వద్ద రెండుగా చీలిపోయే రొంపేరు లెఫ్ట్ ఆర్మ్, రొంపేరు రైట్ ఆర్మ్‌లకు ఈపూరుపాలం స్రయిట్‌కట్, వేటపాలెం స్ట్రయిట్ కట్ ఏర్పాటు చేసి అదనపు నీటిని సముద్రములోనికి వెళ్ళుటకు డ్రైనేజీ శాఖవారు ముందు నివారణ చర్యలను 1973-74 సం.లలో చేపట్టినారు. దీనికి కారణం 1969లో వచ్చినటువంటి భారీ వరదలకు నీలాయిపాలెం (ఉప్పుగుండూరు వద్ద) గ్రామం మొత్తంగానే నామరూపాల్లేకుండా పోయింది. అప్పుడు చీరాల ప్రాంతాన్ని కాపాడింది ఈ కుందేరు డ్రైన్, చీరాల రైల్వే ట్రాక్ మాత్రమే. ఇటువంటి విపత్తుల నుండి ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాల నివారణ కొరకు కేంద్ర ప్రభుత్వం నిపుణులతో కూడిన "మిత్రా కమిటీ"ని వేయగా, ఆ కమిటీ నివేదిక ప్రకారం ఏర్పడినవే ఈపూరుపాలెం, వేటపాలెం స్ట్రయిట్‌కట్‌లు. ఈ స్ట్రయిట్‌కట్స్‌ను నిర్మించాం కాబట్టి కుందేరు డ్రైన్ నీటిపారుదల తగ్గిందని, ఈపూరుపాలెం స్ట్రయిట్ 0.00కి.మీ. నుండి 6.00కి.మీ. (అక్కాయపాలెం బ్రిడ్జీ) వరకు కేవలం 17.00 క్యూమెక్స్ వరదనీరు లేక మురుగునీరు డిచ్చార్జ్ అవుతున్నట్లుగా అందుకు నాలుగు రెట్లుగా లెక్కకట్టి 68.40 క్యూమెక్స్ డిచ్చార్జ్‌గా అంచనా వేసి మిగిలిన స్థలాన్ని రెవెన్యూ శాఖవారికి బదలాయించి పేదలకు పట్టాలు ఇచ్చుటకు జి.ఓ.నెం. 902ను అప్పటి ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య గారు స్థానిక ఎమ్.యల్.ఏ. చొరవతో తెచ్చారు. అసలు సమస్య ఇక్కడే మొదలైంది.

చీరాల కుందేరు డ్రైన్ ఇప్పుడిదికాదు. కుందేరు - మోటుపల్లి-ఆముదాలపల్లి (నేటి బాపట్ల) రోడ్డును సుధానగరం పట్నం (నేటి మన చీరాల) పశ్చిమ దిశ సరిహద్దు రోడ్డుగా ఉన్నట్లు అనంతరాజుల శఖం 1077 (సాకా) మరియు కాకతీయ గణపతి దేవ్ కాలం నాటి మంత్రి గోపరాజు రామన్న క్రీ.పూ. 1145 నాటి కాలం నుండి గుర్తిచబడ్డది మన చీరాల కుందేరు డ్రైన్. ఈ ప్రాంతాలలో ఉన్న భూములు ముంపుకు గురౌతుంటే, ప్రకృతి సహజసిద్ధంగా ఏర్పడిన పేరలి (బాపట్ల) నుండి ఏటిమొగ్గ (పెదపాలెం, చినగంజాం) వరకు ప్రకృతి సహజ సిద్ధమైన కుందేరు డ్రైన్‌ను ప్రజలు సేద్యపు నీటి వసతుల కొరకు, ముంపు నివారణకు కొరకు మరింత అభివృద్ధి చేసుకున్న విషయం చారిత్రక సత్యం. అందుకే పూర్వకాలము నుండి "ఎంత వడగాల్పుల రోజులలో నైనా సాయంత్రమయ్యే సరికి ఈ ప్రాంతం చల్లబడుతుంది" అనే నానుడి ఈ ప్రాంతానికే వచ్చింది. ఆ చల్లని గాలులను ఈ ప్రాంత ప్రజలు తరతరాలుగా ఆస్వాదించడానికి కారణం కుందేరు డ్రైన్ మాత్రమే.

చీరాల కుందేరు డ్రైన్ వెడల్పును తగ్గించి పేదలకు (యస్.సి., యస్.టి., బి.సి., ముస్లిం మైనారిటీలకు) నివేశన స్థలాలు యిచ్చి గృహనిర్మాణం చేయాలనే తలంపుతో జి.ఓ.నెం. 902 కొరకు కృషి చేసినట్లుగా చీరాల ఎం.ఎల్.ఏ. చెబుతున్నాడు. ఎవరికైనా పేదలుగా ఉన్న తమకు ఒక గూడు ఏర్పడుతుందంటే ఆ సమయం కోసం ఆశతో ఎదురు చూస్తారు. ఇక్కడ మేము చాలా స్పష్టంగా ఎవరైతే గూడు కోసం ఆశపడుతున్నారో వాళ్ళ ప్రాణరక్షణగా నిలవాలనే తపనతోనే జి.ఓ.నెం. 902ను రద్దుకోరుచున్నాం. ఎందుకంటే 1973-1974 సం.లో వరద, మురుగు నీరు సముద్రంలో నేరుగా కలుపుట ద్వారా పరిసర ప్రాంతాలు ముంపునకు గురికాకూడదనే తలంపుతో నిర్మించిన వేటపాలెం స్ట్రయిట్‌కట్, ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ (0.00-6.00కి.మీ.) భాగం కూడా ఈ మధ్య ప్రాంతంలోనే ఉంది. ఇక్కడే 1991 నవంబరు నెలలో వచ్చిన తుఫాను వలన వచ్చిన వరదల ఫలితంగా 5గురు మరణించిన సంఘటన ప్రజలు గుర్తించాలి. దీనికి కారణం ఎగువప్రాంతం పేరలి (బాపట్ల) నుండి వరద, మురుగునీరు పల్లపు ప్రాంతమైన చీరాల కుందేరు డ్రైన్ గుండా సముద్రంలో కలవడానికి ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ వద్ద అడ్డుగా ఉన్న గట్లు కారణం. అందువలన సాయినగర్, బండారుకాలనీ, తోటవారిపాలెం గ్రామవాసులు స్ట్రయిట్‌కట్‌కు గండిని కొట్టి వరద ముంపు నుండి తప్పించుకున్నారు. రామకృష్ణాపురం వద్ద ఏరులై పారిన నీటిలో 5 మంది మరణించారు. దీనిని బట్టి అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నట్లు నీటి ప్రవాహం స్ట్రయిట్‌కట్స్ నిర్మించి తర్వాత కుందేరు డ్రైన్‌లో ఎటువంటి ఇబ్బందులు కలుగపోతే ఈ ప్రమాదం ఎలా జరిగింది. ఇది జరిగింది 1991లోనే కదా! ఇది మాత్రమే గాక ఎన్నోసార్లు భారీ వర్షాల కారణంగా కుందేరుకు అంచున ఉన్న గ్రామాలలో నీరు ప్రవహించి పొలాలు దెబ్బతినడం, ఇండ్లలోకి నీరు వచ్చి ప్రభుత్వసాయం అందడం అబద్ధమా? డ్రైనేజి అధికారులు 60 సం॥లు వరుస వర్షపాతాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడం, 0.000 కి.మీ. నుండి 6.000 వరకు గల మధ్య భాగంలోని మురుగుపారుదలను మాత్రమే లెక్కించి ఎగువ ప్రాంతంనుండి చీరాల కుందేరు వస్తున్న నీటిపారుదలను లెక్కించపోవడాన్ని మేము వ్యతిరేకిస్తున్నాం. దీని వలన అధికారులు వేసిన అంచనాలు తప్పు అని చెబుతున్నాం. ఒక ప్రక్క మురుగు నీరు పారుదలకు గ్రామ పంచాయితీల వారు కుందేరులో వేస్తున్న చెత్త-చెదారాలు అడ్డుపడుతున్నాయని నోటీసులిచ్చి మరొక ప్రక్క కుందేరు ఎండిపోయింది అందువలన నీటిపారుదలే లేదు, కాబట్టి నివేశన స్థలాలు ఇవ్వవచ్చు అని ప్రభుత్వానికి నివేదించడం ప్రజలను ప్రభుత్వాన్ని మోసం చేయడమే. "కుందేరు ప్రాంతంలో ఎప్పుడు తేమగా ఉండి ''పశుపక్ష్యాదులు'' నిరంతరం సంచరిస్తుంటాయి. తేమ ప్రాంతమైన కుందేరుకు వేసవి కాలంలో వలస పక్షులు విహారంగా వస్తుంటాయి. కుందేరు వలన చీరాల పరిసర ప్రాంతవాసులకు మంచి ప్రాణవాయువు ఆక్సిజన్ అధికంగా దొరుకుతుంది. భూతాపం వలన అధికంగా వచ్చే వేడిని తగ్గించి వాతారణ సమతుల్యం కాపాడుతుంది. ఇప్పటికే అనేక ప్రాంతాలలో జరుగుచున్న కాలుష్య కారణాలవలన వాతావరణంలో సమతౌల్యం దెబ్బతిని "సునామీ" లాంటి విపత్తులు చీరాలను కూడా తాకిన సంగతి మన అందరికీ తెలుసు. చీరాల, జాంద్రపేట, దేశాయిపేట, రామకృష్ణాపురం, ఈపూరుపాలెం, కొత్తపేట గ్రామ పంచాయితీ పరిధిలలోని డైయ్యింగ్ (రంగుల అద్దకం) యూనిట్ల నుండి విడుదలయ్యే రసాయనాల కలుషిత నీటి వలన ఈ ప్రాంతంలోని త్రాగునీరు ఇప్పటికే పూర్తిగా చెడిపోయి, వాడుకోవడానికి కూడా పనికిరాకుండా పోయింది. అనేక జబ్బులకు కారణమౌతున్న ఈ డైయ్యింగ్ యూనిట్‌లకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సి ఉంది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డువారు డైయ్యింగ్‌లను మూసి వేయమని, విద్యుత్‌శాఖవారు కరెంట్ కట్ చేయడానికి నోటీసులిచ్చి ఊరుకున్నారు. వీటి వలన చీరాల ప్రాంతవాసుల ఆరోగ్యాలు ప్రశ్నార్థకమవుతున్నాయి. అంతేగాక సునామీ సంభవించిన తర్వాత చీరాల పరిసర ప్రాంతాలలో నీటి మట్టం తగ్గింది. చీరాల ప్రాంతం భూకంపం సంభవించే ప్రాంతంగా భూగర్భ శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. అందుకు కుందేరు లాంటి వాటిని కాపాడుకొనడమే అసలైన పరిష్కార మార్గంగా, మేధావుల సూచనల మేరకు మేం భావిస్తున్నాం. ఈ విపత్కర పరిస్థితులను నివేశన స్థలాలు కొరకు ఆశిస్తున్న పేదలు గుర్తించాలని కోరుతున్నాం. నిజంగా పేద ముస్లిమ్, యస్.సి., యస్.టి., బి.సి.లకు ప్రయోజనం కలిగే విధంగా చేయాలంటే కుందేరు ప్రాంతంలో పశువుల దాణాకు అవసరమైన గడ్డితోటలను ప్రోత్సహించాలి. జలరవాణా మార్గాలుగా తీర్చిదిద్దగల్గితే కుందేరు ప్రాంతంపై ఆధారపడి వందల కుటుంబాలు ఉపాధిపొందుతాయి. వీటి వలన ఎవరికి ఎటువంటి నష్టం లేకుండా ప్రకృతి సమతుల్యం నిలబడుతుంది. ఇటువంటి చర్యలను మనం ప్రోత్సహించాలే తప్ప ప్రకృతి భీభత్సాలకు కారణ భూతమయ్యే చర్యలను వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది. 0.000 నుండి 6.000 కి.మీ. మధ్య భాగాన్నే తీసుకొని మిగిలిన అక్కాయపాలెం-చినగంజాం మధ్య ఉన్న వందల ఎకరాల కుందేరు భూమి సంగతేమిటి దాని జోలికి వెళ్ళకపోవడానికి కారణమేమిటి? అక్కడ కుందేరు పోరంబోకు భూమిలేదా! ఉంటే కోట్లకు పడగలెత్తినవాళ్ళు పేదలైపోయి రొయ్యల చెరువులు వేసుకున్నారా! ఒక ప్రక్క పేదలు పట్టెడన్నంకోసం తాపత్రయపడుతూ, దుర్భర జీవితాలను గడుపుతుంటే ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేసి కోట్ల రూపాయలు సంపాదన చేయడం మోసం కదా? పేదలమైన మనకేమో సునామీ ప్రమాదాలా! పలుకుబడి కల్గిన పెద్దలకేమో 'వనామీ' రొయ్యలు సంపాదనా! ఇదెక్కడి న్యాయం? నిజాయితీ ఉంటే కబ్జా చేసిన ప్రభుత్వ భూములను తక్షణమే ముస్లిం, యస్.సి., యస్.టి., బి.సి., ఇతర పేద వర్గాల వారికి ఉపాధి కొరకు భూములను పంచాలి.

మరి పేదల నివేశన స్థలాలమాటేమిటి? వాళ్ళను అలాగే వదిలేద్దామా? అంటే దానికి మనమందరం కలిసి కొన్ని వందల ఎకరాలు ఉన్న ప్రభుత్వ భూములను, డొంక పోరంబోకు, సీలింగ్ భూములను పేదలకు గృహ అవసరాలకు అనుకూలమైన ప్రాంతాలలో ఇవ్వాలనే డిమాండ్‌తో ఐక్యపోరాటాలు చేయాల్సిన అవసరముంది. ఈ విధంగా పేదల అవసరాలను తీర్చడానికి ఐక్యఉద్యమాల ద్వారా ప్రయత్నించి పేదలను కాపాడుకోవాలి. ఇందుకు ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నవో చెప్పటానికి మేము సిద్ధంగా వున్నాం. ఇదే సందర్భంలో చీరాల పరిసర ప్రాంతాలలోని వివిధ గ్రామాలలో స్థిర నివాసులుగా ఉన్న లక్షలాది ప్రజల ప్రాణాలకు ముప్పులేకుండా తెలిసిన సమాచారాల మేరకు జాగ్రత్తలు తీసుకోవాలి. దానిలో భాగంగా కుందేరు డ్రైన్ పరిరక్షణ పోరాట కమిటి తీసుకునే కార్యక్రమాలలో మేధావులు, డాక్టర్లు, లాయర్లు, పట్టణవాసులు, మరీ ముఖ్యంగా ఇండ్ల కొరకు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న యస్.సి., యస్.టి., ముస్లిం మైనార్టీలు, బి.సి., ఇతర కులాల పేదలు ఉద్యమంలో ముందుండి చీరాల ప్రాంతాన్ని ప్రకృతి వైపరీత్యాలనుండి రక్షించుకోవడం ద్వారానే మనందరికీ ప్రాణరక్షణ, ఆరోగ్య రక్షణ ఉందనే వాస్తవాలను గ్రహించాలని కోరుచున్నాం.

**- కుందేరు డ్రైన్ పరిరక్షణ కమిటి, చీరాల**

# తీరని భూదాహం

అభివృద్ధి చెందిన పెట్టుబడిదారి దేశాలలో పరిశ్రమల మీద ఆధిపత్యం కోసం, వాటి ఉత్పత్తుల మార్కెట్ కోసం రెండు ప్రపంచ యుద్ధాలతో సహ స్థానికంగా అనేక యుద్ధాలు జరగడం దానిలోని లోపాలను సవరించడానికి కార్మిక వర్గ నియంతృత్వం క్రింద ఉత్పత్తి సాధనాలను జాతీయీకరించడంలోనే దోపిడి లేని సమాజ నిర్మాణం జరుగుతుందని పెట్టుబడిదారి సమాజానికి ప్రత్యామ్నాయాన్ని చూపిస్తూ వామ పక్షవాదులు ఉద్యమాలు చేసారు చేస్తున్నారు.

మూడవ ప్రపంచదేశాలలో ఉత్పత్తి సాధనమైన భూమిపై అధికారాన్ని భూస్వాముల నుండి దున్నేవానికి భూమి సిద్ధాంతంతో కొద్ది దేశాల్లో దోపిడి రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రయత్నం జరిగింది. వీటిలో మినహాయింపు దిగువ మద్యతరగతి, స్వంత వ్యవసాయదారులు.

ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యవసాయదారులతో సహ అందరూ పారిశ్రామికీకరణ వైపు పరుగులు తీస్తున్నారు. అందరి ఉద్దేశ్యం ఏంచేసయినా సరే వ్యక్తిగతంగా సంపద పోగేసుకోవడమే. దీనికి మనదేశంలో ప్రస్తుత మార్గం భూమి కొనుగోళ్ళు, అమ్మకాలే. ఎదైనా ఒక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలంటే ఆప్రాంతంలో నీటి పారుదల అభివృద్ధి లేక పరిశ్రమల స్థాపనతో సాధ్యం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇటువంటి అభివృద్ధి కొన్ని ప్రాంతాలలో చేయడం జరిగింది. ఆప్రాంతాలలో స్థానికులకు బదులుగా ముందుచూపుతో దూరప్రదేశం నుండి వచ్చిన స్థానికేతరులు కారుచౌకగా భూమిని కొని అభివృద్ధి ఫలాలు అనుభవించడంలోనే ప్రస్తుత సామాజిక వైరుధ్యాలకు మూలకారణం. దీనికి ప్రత్యామ్నాయం ఏమిటి?

ప్రభుత్వమే ఒక పద్ధతిలో భూములన్నింటిని అమ్మకం దారుల వద్ద కొని దాన్ని అభివృద్ధి చేసి ఆరంగంలోని వారికి కేటాయిస్తే అభివృద్ధి ఫలాలు పేదలకు చేరే అవకాశముంది. ఉదా : సెజ్‌లలో భూమిని ప్రభుత్వమే సేకరించి అభివృద్ధి చేసి దాన్ని మాజీ రైతులకు ముందుగా కేటాయించి మిగిలినదాన్ని ఇతర రైతులకు కేటాయించాలి. అలాగే ఒక చెరువో, ప్రాజెక్ట్ నిర్మించే ముందు అక్కడ ఆయకట్టులో రాబోయే ప్రభుత్వ భూముల్ని కాపాడటంతోపాటు తక్కువ ధరలకు భూమిని సేకరించి; ప్రభుత్వ భూమిని, కొన్న భూమిని నిర్వాసితులకు ముంపు భూమికి సమానంగా భూమినిస్తే అభివృద్ధి ఫలాలు వారికే చెందుతాయి.

నల్లధనాన్ని అరికట్టడానికి; భూమిని అమ్మదలచుకొన్న వారినుండి నిరంతరంగా ప్రభుత్వానికే అమ్మేటట్లు ఒక చట్టం తేగలిగితే అదే ధరకు తిరిగి కొనుక్కొనే ఏర్పాటుంటే కొద్దిమంది రైతులు చితికిపోవటం ఆత్మహత్యలకు పాల్పడటం తగ్గుతుంది. తెగ నమ్ముకునే వారికి ప్రభుత్వ భూమి సేకరణ ద్వారా సరసమైన ధర దొరుకుతుంది. దానికి ప్రత్నామ్నాయాలు ఇంకా చాలా ఉండొచ్చు. దీనిపై లోకవిద్యా ప్రపంచం ఒక చర్చ జరగాలని కోరుకుంటోంది.

**- టి.ఎన్.ఆర్.**

# భూమి సమస్య - దళితుల పై బలహీన వర్గాల దాడులు

శ్రీకాకుళం జిల్లా వంగర మండలం లక్ష్మీపేట గ్రామంలో 12.6.2012న ఉదయం 7.45 నిమిషములకు దళితవాడపై తూర్పు కాపులు బొత్స వాసుదేవ నాయుడు నాయకత్వంలో కత్తులు గొడ్డళ్ళతో పాశవికంగా దాడి చేసి 4 గురు దళితులను నరికి చంపారు. మరొకరు ఆస్పత్రిలో మరణించారు. మరో 22 మంది తీవ్రంగా గాయపడ్డారు స్త్రీలపై దాడులు చేసి అవయవాలు నరికి వికలాంగులుగా చేశారు. ఘటన జరిగిన వెంటనే ఫిర్యాదు చేసినా అధికార యంత్రాంగం కదలలేదు. ఎటువంటి సహాయక చర్యలు చేపట్టలేదు.

దళిత మేధావులు, ప్రజాసంఘాలవారు పార్లమెంటు సబ్ కమిటీకి ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించి తక్షణ చర్యలు తీసుకోమని హెచ్చరిస్తే తప్ప రాష్ట్ర ప్రభుత్వం కదలలేదు ముఖ్యమంత్రి పర్యటనలో దాడి చేసిన నిందితులు ఆయన పక్కనే ఉన్నా పోలీసులు అరెస్టు చేయలేదు. ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు నిరసన ప్రదర్శనలు, బంద్‌లు చేయడంతో కొద్దిమందిని మాత్రం అరెస్టు చేశారు. మద్దు వలస ప్రాజెక్టు కింద సేకరించిన భూమిని షెడ్యూలు కులాల వారికి పంచాలని డిమాండ్ చేసినా ప్రభుత్వం స్పందించలేదు. చనిపోయిన వారి కుటుంబాలకు భూమిని కొని ఇస్తామని కలెక్టర్ ప్రకటించారు.

రాష్ట్రంలో కారంచేడు ఘటనల అనంతరం దళిత ఉద్యమం ఆత్మగౌరవ ఉద్యమంగా ప్రారంభంకావడం, దేశంలో కుల సమస్యపై తీవ్రమైన చర్చకు దారితీసింది. కారంచేడు ఘటన వామపక్ష అభ్యుదయ శక్తులను కులనిర్మూలనపై మీ వైఖరి ఏమిటని నిలదీసింది. అదే కాలంలో ఉత్తరప్రదేశ్‌లో దళితులు కాన్షీరాం నాయకత్వాన సంఘటితమై దళిత బహుజన మైనారిటీ శక్తుల వేదికగా పార్లమెంటరీ పార్టీగా అవతరించి బేరమాడే శక్తిగా ఎదిగింది. బి.ఎస్.పి. ప్రభావంతో ఆంధ్రరాష్ట్రంలో షెడ్యూలు కులాల వారు, దళితులు 1985లో దళిత మహాసభ గాను, తర్వాత చీలిపోయి 1995లో మాదిగ దండోరాగా ఆవిర్భవించింది. అయితే దళిత ఉద్యమంలో తలెత్తిన అప్రజాస్వామిక దోరణుల వలన పార్లమెంటరీ రాజకీయాలలో దళితులు ఒక స్వతంత్ర శక్తిగా నిలబడలేక పోయారు.

**కౌలుభూమిపై హక్కు సాధించిన బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం :**

కారంచేడు ఈనాడు దళిత ఉద్యమానికే గాక, గత కాలంలో బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమంకు పునాదివేసింది. భావజాలరంగంలోనూ సాంస్కృతిక, సామాజిక రంగంలోనూ బ్రాహ్మణ అగ్రహారాలకు వ్యతిరేకంగా పోరాడిన ఆనాటి కౌలుదారులు (కమ్మవారు) ఇతర వర్గాలతో కలిసి భూమిపై హక్కు సాధించి దున్నేవానికే భూమి నినాదంతో విజయం సాధించారు. అనంతరం నీటిపారుదల సౌకర్యాలు గల కోస్తా ప్రాంతంలో సారవంతమైన భూమిని సాగుచేసి ఆర్థిక స్తోమతను పెంచుకోవటంతో విద్యా ఉద్యోగాలలో ప్రవేశించి అభివృద్ధి అయ్యారు. అనంతర కాలంలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీగా అవతరించేనాటికి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా నిలిచారు. కారంచేడు, చుండూరు దళిత ఉద్యమం ఆత్మగౌరవ ఉద్యమంగా ప్రారంభమైనా, అది కేవలం మరణించిన వారి కుటుంబాల వారికి నష్టపరిహారం, ప్రభుత్వ ఉద్యోగాలు, కొంతవరకు భూమిని మాత్రం ప్రభుత్వం నుండి పొందగలిగారు. ప్రకాశంజిల్లా తిమ్మ సముద్రంలో భూస్వాముల ఆధ్వర్యంలో ఉన్న బంజరు భూములకై పోరాడినా, గోదావరి జిల్లాలో దేవదాయ భూములు పంచమని ఆందోళన చేసినా ప్రభుత్వం ఆ ఉద్యమాల్ని నిర్దాక్షిణ్యంగా అణచివేసింది. దళిత ఉద్యమం భూమి సమస్యను లేవనెత్తినా కారంచేడు లాంటి సమస్యల వరకే పరిమితం అవడం రాష్ట్ర వ్యాప్త సమస్యగా మార్చి ఇతర శక్తులతో కలిసి భూమి సాధించడంలో విఫలమైంది పాలక వర్గాలు ఓటు బాంక్ పథకాల ద్వారా క్రింది వర్గాలను పక్కదారి పట్టించి, భూమి సమస్యలను పూర్తిగా ఎజెండాలోంచి ఎత్తివేసింది.

ప్రభుత్వం వామపక్ష ఉద్యమంపై ఉక్కుపాదం మోపి, మరోవైపు భూసంస్కరణల పేరుతో పనికిరాని బంజరు భూములను పంచింది. కోస్తా జిల్లాలో దేవాదాయ భూములు, మిగులు భూములు పేదలకు పంచితే, సహజ నీటి వనరులున్న ఈ ప్రాంతంలో క్రింది వర్గాలలో ఆర్థిక, సాంఘిక అభివృద్ధికి అవకాశముండేది. రిజర్వేషన్ల అమలువలన ఉద్యోగాల్లోకి ప్రవేశించిన దళిత మధ్యతరగతి వర్గం దళిత ఉద్యమానికి అండగా ఉన్నారు. అయితే మధ్యతరగతికి ఉండే ఊగిసలాట ధోరణి వల్ల పార్లమెంటరీ రాజకీయాల్లో ఆధిపత్య శక్తుల ఆర్థిక శక్తి ముందు పోటీకి నిలవలేక పోయారు. దళిత ఉద్యమంలో తలెత్తిన మనువాద దృక్పథము, ఆధిక్యతా ధోరణులు అగ్రకులాల్లో అందరి ఎడల ద్వేషభావం వల్ల వీరిని ఇతర వర్గాల నుండి దూరం చేసింది. అందువల్ల దళిత ఉద్యమం స్వతంత్ర ఉద్యమంగా ఎదగకుండా పాలక పార్టీల వ్యూహ్యంలో పావులుగా మారాయి.

రాష్ట్ర జనాభాలో, సంఖ్యారీత్యా మెజారిటీ అయిన బి.సి. కులాల నుండి తెలంగాణా ప్రాంతంలో కరణం, మునసబు వ్యవస్థ రద్దు చేసి మండల వ్యవస్థను ప్రవేశపెట్టడం, బి.సి. రిజర్వేషన్ల వలన ప్రధానంగా యాదవ, గౌడ కులాలనుండి 2వ శ్రేణి నాయకత్వం ఎదిగి వచ్చింది. ఈ పరిణామాలు రాజకీయ రంగంలో పునరేకీకరణకు దారితీసింది. తెలంగాణా ప్రాంతంలో హైదరాబాద్ చుట్టుపక్కల, ఔటర్ రింగ్ రోడ్, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి భారీ ప్రాజెక్టులు రంగారెడ్డి జిల్లా రూపులేఖలనే మార్చివేశాయి. హైదరాబాద్ చుట్టుప్రక్కల చెరువులతో పాటు కాలువలు అదృశ్యమయ్యాయి. కొండ గుట్టలు, సాగుకు యోగ్యం కాని భూములు సెజ్‌ల కోసం చేతులు మారాయి. అసలు యజమానులు కన్నా కోస్తా, రాయల సీమ నుండి తరలివచ్చిన ఫ్యాక్షనిస్టులు, రాజకీయనాయకులు, తెలంగాణ నుండి రెడ్లు, వెలమలు కోట్లకు పడగలెత్తారు పాలకులకు అనుయాయిలుగా ఉన్న బ్రోకర్లు, కిరాయిహంతకులు, రౌడీలు రియల్ బూమ్‌లో ప్రవేశించి దౌర్జన్యంగా స్థలాలు ఆక్రమించి బలవంతంగా కొనుగోళ్ళు చేసి కోట్లాది రూపాయలు కూడబెట్టారు. 1991 తర్వాత ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు రాజకీయ నాయకుల పాలిట కల్పతరువుగా మారి ప్రజాప్రతినిధులు కార్పొరేటర్లు, సర్పంచులు, ఎం.పి.టి.సి.లు, వార్డ్ సభ్యులు ఆస్తులు సంపాదించారు. ప్రతి రాజకీయ నాయకుడు అనేక భవనాలు, మార్కెట్ స్థలాలు షాపులు భారీగా సంపాదించారు. కొనడం, అమ్మడం అనే ప్రక్రియ గత 10 సం॥ల కాలంలో వూహించనంతగా (ఏ పార్టీవారయినా) చేస్తూ ఆస్తులు కూడబెట్టారు. అధికార పార్టీలకు దగ్గరగా ఉండి, అధికారం అండతో కోట్లకు ఎదిగిన వారిలో ప్రధానంగా రెడ్డి, కమ్మ, వెలమ, గౌడ కులాల సంపద గల వర్గాలే లాభపడ్డాయి. కీలకమైన కాంట్రాక్టులు, అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఔటర్ రింగ్ రోడ్డు, సెజ్‌లు - రాయితీలు పొందినవారిలో మూడు ప్రాంతాలకు చెందిన రెడ్డి, కమ్మ, వెలమ వర్గాల చేతిలోనే ఉన్నాయి.

తెలంగాణా ప్రాంతంలో చెరువుల కింద భూమి కలిగిన రెడ్లు, వెలమలు చెరువుల ప్రాముఖ్యత తెలిసి నీటి వినియోగం ద్వారా వ్యవసాయానికి నష్టం కలగకుండా చూసేవారు. అగ్ర కులాలకు చెందినవారు కాంట్రాక్టర్‌లుగా మారిపోయి ఆర్థిక వనరులను ఉపయోగించి వ్యాపారాల్లో, కాంట్రాక్టులలో ప్రవేశిస్తే రెండవ శ్రేణిగా ఉన్న బి.సి. కులాల నుండి గౌడ, యాదవులు నాయకులుగా వచ్చినవారు చెరువుల కింద భూములు కలిగి ఉన్నా, రియల్ బూమ్‌లో వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసి, చెరువులను, కాలువలను, వాగులను ఇసుక తవ్వకాలు చేసి, చెరువులు ధ్వంసం అయ్యేందుకు దోహదపడ్డారు. భూగర్భ జలాల తగ్గుదలకు రాష్ట్ర వ్యాప్తంగా నీటిపారుదల క్రింద అభివృద్ధి అయిన భూమి 40 శాతం ఉంటే రంగారెడ్డి జిల్లాలో 9 శాతం మాత్రమే. ఇది కూడా పోయిన దశాబ్దంలో 4 శాతంకు తగ్గిపోయింది. నీటి పారుదల సౌకర్యాలున్న చోట, సాగుభూములు, బంజరు, దేవాదాయ భూములు బి.సి., ఎస్.సి. లకు పంచితే ఆర్థికంగా నిలదొక్కుకొని విద్య ఉద్యోగాల్లోకి ఎదిగి వచ్చేవారు. అయితే పాలక వర్గాలు భూమిపై ఆధిపత్యం వదులుకోవడానికి సిద్ధంగా లేరు. వివిధ రూపాల్లో వైరుధ్యాలు సృష్టించి పేదల మధ్య వివాదాలు పుట్టించడం ద్వారా తమ జోలికి రాకుండా చూసుకున్నారు.

లక్ష్మీపేట మద్దువలస ప్రాజెక్టు కింద సేకరించిన 600 ఎకరాల భూమి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి స్థాయికి నిర్మించక పోవడం, కరకట్టలు నిర్మించకపోవడం వలన ఈనాడు అవి పడావుగా పడి ఉన్నాయి. రేపు ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిర్మిస్తే ముంపుకు గురవుతాయి. అప్పటిదాకా ఈ భూమిని దళితులు, కాపులు సాగుచేయగలరు తప్ప తర్వాత సాధ్యం కాదు. ఈ మొత్తం వ్యవహారంలో చట్టపరంగా ఎవరికీ భూమిపై హక్కు లేదు. సహజ న్యాయం ప్రకారం చూస్తే సాగు చేసే వారికే హక్కు ఉంటుంది. అలా చేయకుండా అడ్డుపడి దాడి చేసిన తూర్పు కాపులు, దాడికి సహకరించిన జిల్లా యంత్రాంగం నేరస్తులు. దాడి చేసిన బొత్స వాసుదేవ నాయుడు తదితరులు, జిల్లా అధికారులపై కేసు పెట్టి అరెస్టు చేయాలి, కఠినంగా శిక్షించాలి.

ప్రకాశం జిల్లాలో వాన్‌పిక్, కింద 28000 ఎకరాలపైనే రస్ ఆల్ ఖైమా పేరుతో 450 కోట్లతో 2 పోర్టుల నిర్మాణం పేరుతో అనేక మందికి ఉపాధి కల్పిస్తామని భూములు కొనేందుకు డబ్బులు సేకరించి 300 కోట్లతో భూములు కొని 150 కోట్లు నిమ్మగడ్డ ప్రసాదు లాంటివారు కాజేశారు అంతేగాక సేకరించిన భూమికి 10 శాతం టాక్స్ ప్రభుత్వానికి చెల్లించకుండా కోట్ల రూపాయలు లబ్ధిపొందారు.

క్రీ.శే. వై.యస్. రాజశేఖర రెడ్డి ప్రభుత్వానికి స్వాధీనం చేసిన ఎసైన్డ్ భూములపై దాఖలు అయిన కేసులో హైకోర్టు తీర్పు ఇస్తూ ఎసైన్డ్ భూములను ఎవరికి కేటాయించవద్దని స్పష్టంగా ఆదేశాలు జారి చేసింది. దీనికి భిన్నంగా ప్రకాశం జిల్లాలో మాత్రం ఎసైన్డ్ భూములకు వాన్‌పిక్ నష్టపరిహారం చెల్లిస్తుందని 1110 జి.వో లో పేర్కొన్నారు.

పాలక వర్గాల ముఠా కక్ష్యలలో భాగంగా జగన్‌పై జరుగుతున్న దాడిలో ఈ అవకతవకలు ఉనికిలోకి వచ్చాయి. భూముల అమ్మకంలో డబ్బులు వచ్చినా, పంట భూముల అమ్మకం వలన కుటుంబం, పిల్లలు వారి పిల్లలకు ఉన్న ఉద్యోగ భద్రతను కోల్పోతున్నాం. ఉత్తరప్రదేశ్‌లో రహదారి ప్రాజెక్టుకి భూమి అడిగితే రైతులు ఎకరాకు 20 లక్షలు డిమాండ్ చేశారు. బ్రోకర్లు దగాకోర్లు కోట్లాది రూపాయలు లబ్ధి పొందుతుంటే రైతులు చూస్తూ ఊరుకోవలసిన అవసరం లేదు. కాబట్టి తమ భూమికి న్యాయమైన రేట్లను ఉత్తరప్రదేశ్ రైతుల్లా కుటుంబంలోని సభ్యుల అందరి ప్రయోజనాలు 3 తరాలు వరకు లెక్కించి డిమాండ్ చేయాలి. కారుచౌకగా భూములు కొన్న వారినుండి తమను మోసం చేసిన వారి నుండి భూమిని వెనక్కి తీసుకోవాలి. లేదా న్యాయమైన నష్టపరిహారం కుటుంబ సభ్యుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని డిమాండ్ చేయాలి.

రాష్ట్రంలో నేడు పాలకులు, సెజ్‌ల పేరుతో వేల ఎకరాలు పంట భూములు సేకరించినా, ఆర్థిక మాంద్యంతో అనుకున్న విధంగా పెట్టుబడులు రాకపోవటం, పాలకవర్గాల వైరుధ్యాలు, ఏ ఏ రూపాల్లో ఎన్నెన్ని మోసాలు చేశారో ఒకరి గూర్చి మరొకరు పత్రికల్లో రాశాయి. న్యాయ వ్యవస్థను సైతం భ్రష్టు పట్టించి, వారి కనుకూలంగా వివిధ (నాట్‌బిఫోర్ మి) పేర్లతో, జడ్జిలకు కోట్ల రూపాయలు లంచాలు ఇచ్చి (గాలి జనార్ధన్ రెడ్డి) కేసులు, ఇతరత్రా అవకతవకలు పెట్టుబడిదారీ ఫ్యూడల్ వ్యవస్థ సంక్షోభాన్ని బహిర్గతపరుస్తున్నాయి. ఈనాడు వేల ఎకరాల పంట భూములు పడావుగా పడి ఉన్నాయి. అవకతవకలకు పాల్పడిన వారిలో మంత్రులు ఐ.ఎ.ఎస్. అధికారులు కొద్దిమంది జైళ్ళలో ఉన్నారు. ఈ నేపథ్యంలో భూమిలేని దళిత బలహీన వర్గాల వారు, మైనార్టీలు, అగ్రవర్ణాల పేదలు నీటి పారుదల సౌకర్యాలున్న చోట వ్యవసాయం చేసే వారికి భూమిలేని కౌలుదార్లకు పంచాలని ఉద్యమించాల్సి ఉంది. నిన్నటి దాకా పంచేందుకు భూమి లేదన్నారు. నేడు వేల ఎకరాలు వృధాగా పడి ఉంది. జంట నగరాల చుట్టుపక్కల వేల ఎకరాలు కొద్దిమంది చేతిలో బందీ అయ్యాయి గతంలో చెరువు కింద వ్యవసాయం చేసేవారు నేడు చెరువుల్లో నీరు ఉన్నా సాగు చేయలేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో గతంలో బ్రాహ్మణ వ్యతిరేక పోరాటంలో, దున్నే వానికి భూమి పేరుతో కౌలుదారులు (అగ్రకులాల వారు) రైతులుగా మార్పు చెంది ఆర్థికంగాను, సాంఘికంగాను ఎదిగివచ్చిన క్రమం నుండి ఎస్.సి., బి.సి. కులాలు ఇతరులు గుణపాఠాలు నేర్చుకోవాలి. మరో లక్ష్మీపేట పునరావృతం కాకుండా దళిత, బహుజనుల అభివృద్ధి భూమి కేంద్రంగా ప్రధానంగా నీటి వనరులున్న చోట దున్నే వానికే భూమి పేరుతో భూమిపై హక్కు సాధించాలి. ఈ భూమి కూడా పురుషుల పేరుపై కాకుండా స్త్రీల పేరుపై ఇవ్వాలని డిమాండ్ చేస్తే సామాజిక పునరేకీకరణకు దారితీసి కొంతవరకు అసమానతలు నిర్మూలించవచ్చు. కింది వర్గాలు దూరదృష్టితో ఐక్యంగా ముందుకొస్తే మరిన్ని విజయాలు సాధించగలరు. ఈ వైపుగా ప్రత్యామ్నాయ శక్తులు దృష్టి సారిస్తారని ఆశిద్దాం.

- కె.జె. రామారావు

**మీకు తెలుసా!**

**10 గ్రాముల పొగాకుతో 10 సిగరెట్లు ఉన్న కింగ్స్ ప్యాకెట్ 60 రూ॥లకు మనకు అమ్ముతున్నారు. అంటే గ్రాముకి 6 రూ॥లు లేదా కేజీకి 6 వేల రూపాయలు చెల్లిస్తున్నాం. రైతుకి కిలో పొగాకుకి 28 నుంచి 30 రూపాయలు కంపెనీలు చెల్తిస్తున్నాయి. అంటే పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్త, వ్యాపారస్తులు, ప్రభుత్వం కలిసి కేజీకి 5970 రూపాయలు సంపాదిస్తున్నారని మీకు తెలుసా!** తటవర్తి నారాయణరావు

జ్ఞానం లాభాలకోసం కాదు.

జ్ఞానం సమాజంలోనుంచే ఉద్భవిస్తుంది.

జ్ఞానం మానవుడు సంపూర్ణ మానవుడవటానికి దోహదపడాలి.

జ్ఞానం ఏ ఒక్కరి సొత్తు కాదు. ఇతరులను దోచుకోవటానికి పనికొచ్చేది జ్ఞానం కాదు.

వ్యక్తిత్వ వికాసానికి సమాజంలో అందరికి ఉపయోగపడేది జ్ఞానం.

విద్య అంటే సమాజంలో అసమానతలను తొలగించేది.

అన్ని రకాల విద్యలు, వృత్తులు సమానమే

జ్ఞానం మానవుడు సంపూర్ణ మానవుడవటానికి దోహదపడాలి.

జ్ఞానం మానవుడు సంపూర్ణ మానవుడవటానికి దోహదపడాలి.

జ్ఞానం లాభాపేక్ష కోసం పరిశ్రమ కారాదు

**"లోకవిద్య ప్రపంచం" చదవండి, చదివించండి,**
**చందాదారులుగా చేరండి**

దీనిలోని వ్యాసాలు యథాతథంగా ఎవరైనా, ఎక్కడైనా
ప్రచురించటానికి హక్కులు అందరివి.

వ్యాసాలు, ఉద్యమ వార్తలు పంపించవలసిన చిరునామా :
Loka Vidya Prapancham
D.No. 10-100, New Gaddiannaram, Hyderabad - 500 060. Ph : 040-24152155
e-mail : tnrkoundinyasa@yahoo.com

**BOOK - POST PRINTED MATTER**
**AUGUST - 2012**

To

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Hyderabad - 500 060.